క్లుప్తంగా

పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఆర్వో మోహన్‌రావు

సారవకోట: పోస్టల్ బ్యాలెట్లపై అవగాహన కల్పించాలని నరసన్నపేట నియోజకవర్గ ఆర్వో మోహన్‌రావు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బీఎల్‌ఓలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 85 ఏళ్లు పైబడిన వారు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయకుండా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం ఉందన్నారు. అటువంటి వారి కోసం ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. తహసీల్దార్ ప్రభావతి, ఎంపీడీఓ రాంబాబు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సారవకోట: మండలంలోని బద్రి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నవ ధాన్యాల సాగుపై సోమవారం అవగాహన కల్పించారు. నవ ధాన్యాల సాగుతో నేల సేంద్రియ కార్బనాన్ని పెంచి ఖరీఫ్‌లో వేసే ప్రధాన పంటకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీని వల్ల సూక్ష్మ జీవులకు ఆహారాన్ని అందించి మొక్కకు కావాల్సిన పోషకాలను సమృద్ధిగా అందుతాయన్నారు. నవధాన్యాలు పంట 45 రోజులు పూర్తయిన తరువాత కోత కోసి వాటిని పశువులకు దాణాగా వాడవచ్చన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సారవకోట: జలుమూరు మండలం లింగాలపాడుకు చెందిన పంగ సింహాచలం సోమవారం తెల్లవారు జామున విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల 11వ తేదీ రాత్రి సారవకోట మండలంలోని బద్రి గ్రామంలోని అత్తారింట్లో భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సింహాచలం కుమారుడు చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ రమణమూర్తి కేసు నమోదు చేశారు.

శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం



కోదండరాముని ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

ఆమదాలవలస రూరల్: మండలంలో పొన్నాంపేట గ్రామంలో గల రామమందిరం వద్ద శ్రీరామనవమి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటిరోజు స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగింపు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం అఖండ దీపారాధన, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులంతా కలిసికట్టుగా నిర్వహించే ఈ ఉత్సవాలను ఎంతో వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఊరేగింపులో భాగంగా మహిళలు చేసిన కోలాటం ఆకట్టుకుంది. ఈ పూజల్లో యువకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



డాన్స్ చేస్తున్న విద్యార్థులు

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు బాగున్నాయని, సౌకర్యాలు మెరుగుపడ్డాయని, ఆంగ్ల మాధ్యమం అమలు చేస్తున్నామని, విద్యార్థుల తల్లిదండ్రులు విధిగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని నరసన్నపేట ఎంఈఓ దాలినాయుడు అన్నారు. మండలంలోని యారబాడు ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. విద్యార్థులు వివిధ సాంస్కృతి కార్యక్రమాలతో అలరించారు. హెచ్‌ఎం దువ్వాడ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

కొత్తూరు: ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉపాధి వేతనదారులు పనులకు వచ్చినప్పుడు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ త్రివిక్రమరావు అన్నారు. మండలంలోని సిరుసువాడలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం పరిశీలించారు. పనుల వద్ద టెంట్‌లు ఏర్పాటుచేయాలని, తాగునీటి సదుపాయం కల్పించాలని క్షేత్ర సహాయకుడికి సూచించారు. తప్పుడు మస్తర్లు వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేసినప్పుడే రూ.300 వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు.

ఫ్యాన్ ప్రభంజనం ఖాయం

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి
- ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఆమదాలవలస నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామని స్పీకర్, వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం తెలిపారు. మండలంలోని లైదాం గ్రామంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటర్లకు కరపత్రాలు అందజేసి, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. జలుమూరు మండలం లింగాలవలస, హరికృష్ణమ్మపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. పేదల ప్రభుత్వాన్ని ఆదరించాలని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కోరారు. సారవకోట మండలంలోని బుడితి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. నరసన్నపేట పట్టణంలోని బండి వీధిలో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలాసలో టీడీపీ నిర్వహించిన సభలో చంద్రబాబు ప్రసంగంపై కృష్ణదాస్ మండిపడ్డారు. అన్నీ అబద్ధాలు మాట్లాడారని అన్నారు. జిల్లా గురించి మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. మీదే పేటీఎం బ్యాచ్ అని అన్నారు. జిల్లా అభివృద్ధి అంతా వైఎస్సార్‌సీపీ హయాంలోనే జరిగిందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రజలను కోరారు. మెళియాపుట్టి మండలంలోని సుందరాడ, పెద్దపద్మాపురం, మెళియాపుట్టి, చాపర గ్రామాల్లోని ఉపాధి వేతనదారులను కలిశారు. ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజాసంక్షేమమే వైఎస్సార్‌సీపీ అజెండా అని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నం మండలంలోని పెద్దలక్ష్మీపురం, వెంకటాపురం, పెద్దసరియాపల్లి, తెంబూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. నరసన్నపేట పట్టణంలోని పైడితల్లి ఆలయం వద్ద నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కోడళ్లు శ్రావణి, గ్రీష్మ ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని జగన్నాథపురం పరిసర వీధుల్లో ప్రచారం చేపట్టారు. కొత్తూరు మండలంలోని ఎస్ఎస్ కాలనీలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి కుమారుడు ఓం శ్రీకృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా రెడ్డి శాంతిని, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. బూర్జ మండలంలోని చిన్నలంకాంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆమదాలవలస నియోజకవర్గం ఎమ్మెల్యేగా స్పీకర్ తమ్మినేని సీతారాంను, శ్రీకాకుళం ఎంపీగా పేరాడ తిలక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



పొందూరు: కళ్లాం వద్ద రైతులతో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



సారవకోట: బుడితిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



పొందూరు: వృద్ధుడి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



జలుమూరు: లింగాలవలసలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



మెళియాపుట్టి: మండల కేంద్రంలో ఉపాధి వేతనదారులను కలిసేందుకు వచ్చిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పాతపట్నం: పెద్దలక్ష్మీపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



నరసన్నపేట: జగన్నాథపురంలో ప్రచారం నిర్వహిస్తున్న ధర్మాన శ్రావణి, గ్రీష్మ



కొత్తూరు: ఎస్ ఎస్ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఓం శ్రీకృష్ణ



నరసన్నపేట: బండి వీధిలో ఫ్యాన్ గుర్తు చూపిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



బూర్జ: చిన్నలంకాంలో ఓటర్లకు అభివాదం చేస్తున్న చిరంజీవినాగ్

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



బూర్జ: కరపత్రం అందజేస్తున్న అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు



నరసన్నపేట: మహిళలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న అగ్నిమాపక అధికారి

బూర్జ: అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై మన్యం జిల్లా పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అవగాహన ఉండాలన్నారు. మండలంలోని బూర్జ గ్రామంలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం రెండో రోజు కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్లు, స్కూళ్లు, ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్‌లో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఏదైనా ప్రమాదం, విపత్తు సంభవించినప్పుడు 08941 260111, 9553918425 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఏపీజీవీబీ మేనేజర్, మండల పరిషత్ కార్యాలయ, పోస్టల్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి..

నరసన్నపేట: మహిళలు తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఇళ్లల్లో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని నరసన్నపేట అగ్నిమాపక అధికారి వరహాలు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా నరసన్నపేటలో ప్రమాదాల నివారణా చర్యలు, సూచనల కరపత్రాలను సోమవారం పంపిణీ చేశారు. రోడ్లపై వాటర్ విడిచిపెట్టి డెమో నిర్వహించారు. సిబ్బంది సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్

ఆమదాలవలస: మే 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలోని ఓటర్లందరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని తహసీల్దార్ కె.వేణుగోపాల్ పిలుపునిచ్చారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. రానున్న ఎన్నికల్లో శతశాతం ఓటింగ్ జరిగేలా సంకల్పించాలని కోరారు. ప్రలోభాలకు తావులేకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. 85 ఏళ్లు పైబడిన వృద్ధులకు, విభిన్న ప్రతిభావంతులకు, ఆరోగ్యపరంగా అత్యవసర పరిస్థితి ఉన్నవారికి ఇంటి నుంచే ఓటు హక్కు ఉపయోగించుకోవడానికి ఎన్నికల సంఘం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందన్నారు. ఆర్‌ఐ శిరీష, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

హేమసుందరరావుకు నంది అవార్డు



హేమసుందరరావును సత్కరిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ.. తెలుగు భాష, సాహిత్యం రంగాల్లో చేస్తున్న కృషికి ఫలితంగా స్పీకర్ పీఎస్, శ్రీకాకుళం డివిజన్ డవలప్‌మెంట్ అధికారి కొత్తకోట హేమసుందరరావుకు బంగారు నంది అవార్డు వరించింది. ఈయన రాసిన కవితా రచనలు, ప్రతిభను హైదరాబాద్‌లోని ఆదర్శ కళానిలయం వారు గుర్తించారు. 2024-ఉగాది పురస్కారాల్లో భాగంగా బంగారు నంది అవార్డుకు ఎంపిక చేశారు. తెలంగాణ సారస్వత పరిషత్ భవనంలోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు ఆడిటోరియంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నట్లు హేమసుందరరావు తెలిపారు. మూవీ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మానిక్, దైవజ్ఞ శర్మ, పలువురు సినీ, టీవీ నటులు, నంది అవార్డు గ్రహీతలు, సంస్థ ప్రతినిధులు క్రోధినామ ఉగాది పౌర సన్మానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా హేమసుందరరావుకు జిల్లా వాసులు పలువురు అభినందనలు తెలిపారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి..



పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న చిరంజీవినాగ్

ఆమదాలవలస: బూర్జ మండలంలోని వావామ్ పంచాయతీ పరిధి ఉప్పేట గ్రామానికి చెందిన 30 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. వారికి పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ ఆమదాలవలసలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయం వద్ద సోమవారం పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిరంజీవినాగ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో వంకా లక్ష్మీనారాయణ, పోతిన శ్రీను, కె.మల్లేష్, పట్టణ వెంకటరావు, బొమ్మ అప్పన్న, బెవర రమణ, బెవర నందికేశ్వరరావు, నీలం లక్ష్మీనారాయణ, వెంకటాపు గణేష్, రంధి సూర్యనారాయణ, బట్న కృష్ణారావు, బొల్లు తిరుపతిరావు, కోడి లక్ష్మీనారాయణ, కొరికాన రామకృష్ణ, రంధి కృష్ణమూర్తి, బొల్లు కనకారావు, బొల్లు త్రినాథ, పైల లక్ష్మణరావు, సాధు సందీప్, నీలం మహేష్, బోల్లు కిశోర్, నారుగొప్పల అవినాష్, వెంకటాపు దామోదరరావు, కొరికాన ఉపేంద్ర తోపాటు మరికొందరు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బూర్జ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, పార్టీ నాయకులు కర్నేన నాగేశ్వరరావు, వియ్యపు కృష్ణ, తొత్తడి సురేష్, లావేటి శ్రీను, గొలివి మంజుల, వావిలపల్లి గోవిందరావు, మజ్జి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సీతారాముల తోట సంబరం



సీతారాముల చరిత్రను వివరిస్తున్న అర్చకుడు సూరిబాబు



హాజరైన మహిళలు

నరసన్నపేట: స్థానిక జగన్నాథపురంలో గల గీతా మందిరం ఆధ్వర్యంలో సీతారామస్వామివారి తోట సంబరాన్ని(ఎదుర్కొలు) సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సీతారాముల కల్యాణం, పట్టాభిషేకం గురించి అర్చకుడు సూరిబాబు వివరించారు. జగన్నాథపురం వీధులన్నీ జైశ్రీరామ్ నినాదంతో మార్మోగాయి. వైస్ ఎంపీపీ పాగోటి జయలక్ష్మి దంపతులతోపాటు పలువురు పాల్గొన్నారు.

45 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు

పాతపట్నం: నియోజకవర్గంలో 45 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నట్లు అధికారులు గుర్తించారు. నియోజకవర్గంలో 322 పోలింగ్ కేంద్రాలున్నాయి. పాతపట్నం మండలంలోని 77 పోలింగ్ కేంద్రాల్లో 7 సమస్య సమస్యాత్మక కేంద్రాలు, మెళియాపుట్టి మండలంలోని 78 పోలింగ్ కేంద్రాల్లో 5 పోలింగ్ కేంద్రాలు, కొత్తూరు మండలంలోని 80 పోలింగ్ కేంద్రాల్లో 20 పోలింగ్ కేంద్రాలు, హిరమండలం మండలంలోని 44 పోలింగ్ కేంద్రాల్లో 10 పోలింగ్ కేంద్రాలు, ఎల్.ఎన్.పేట మండలంలోని 43 పోలింగ్ కేంద్రాల్లో 3 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు గుర్తించారు. 1,200 ఓట్లు దాటిన పోలింగ్ కేంద్రాలు 11 ఉన్నాయని, 143 పోలింగ్ కేంద్రాల్లో 4 శాతం ఓట్లు అదనంగా కలిశాయన్నారు. అంతర రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో 58 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 193 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాలు అధికారులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది.

వలంటీర్ల రాజీనామా



సారవకోట: రాజీనామా పత్రాలతో వలంటీర్లు



ఎల్.ఎన్.పేట: రాజీనామా చేసిన వలంటీర్లు

సారవకోట: మండలంలోని 87 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. గొర్రిబంద, అన్నుపురం, అంగూరు, గోవర్ధనపురం, పెద్దలంబ, అలుదు, కుమ్మరిగుంట, చిన్నగుజ్జువాడ తదితర పంచాయతీలకు చెందిన వలంటీర్లు ఎంపీడీఓ రాంబాబుకు తమ రాజీనామ పత్రాలను అందజేశారు. రానున్న సాధారణ ఎన్నికల్లో తామంతా సైనికుల్లా పనిచేసి మరలా జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుంటామన్నారు.

ఎల్.ఎన్.పేట: మండలంలోని కరకవలస గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న శ్యామలాపురం వంశధార పునరావాస కాలనీకి చెందిన వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను గ్రామ సచివాలయం కార్యదర్శికి అందజేశారు.

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం సచివాలయం పరిధిలోని 17 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి సాయిరాంకు అందించారు. ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోలాకి రమణయ్య ఉన్నారు.

ఆమదాలవలస రూరల్: మండలంలోని కట్యాచార్యులపేట గ్రామ సచివాలయం పరిధిలో గల ఆరుగురు వలంటీర్లు, నెల్లిపర్తి గ్రామ సచివాలయం పరిధిలో గల 12 మంది వలంటీర్లు తమ విధులకు సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను సచివాలయ కార్యదర్శులకు అందజేశారు.

కొత్తూరు: మండలంలోని బలద గ్రామ సచివాలయం పరిధిలోని 9 మంది వలంటీర్లు సోమవారం తమ విధులకు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను గ్రామ సచివాలయ కార్యదర్శి ఉమారాణికి అందజేశారు.



నరసన్నపేట: రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేస్తున్న వలంటీర్లు



ఆమదాలవలస రూరల్: కట్యాచార్యులపేటలో రాజీనామాలను అందజేస్తున్న వలంటీర్లు



కొత్తూరు: రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు